క్లుప్తంగా

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



మాచర్ల: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆయన క్యాంపు ఆఫీసులో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. వెనుకబడిన మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి నిధులను కేటాయించి విడుదల చేయాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



గురజాల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బీజేపీ నాయకుడు జక్కా కోటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు అమ్మకు ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మనస్సులో వచ్చిన ఒక మాట ఇది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ధీకొండ రాధాకృష్ణ, పెనుగొండ అమృతలింగేశ్వరరావు, మారం రామలింగేశ్వరరావు, లేళ్ల కృష్ణ తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి



మాచర్ల: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాల మేరకు అమ్మ పేరుతో ఒక మొక్క (ఏక్ పేడ్ మా కే నాం పర్) కార్యక్రమం నిర్వహించారు. మాచర్ల పట్టణంలోని సాగర్ రోడ్‌లో నాగ బుద్ధుని శివాలయంలో బీజేపీ మాచర్ల పట్టణ అధ్యక్షుడు ఓర్సు క్రాంతికుమార్ తల్లితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఓర్సు పద్మావతి పట్టణ ప్రధాన కార్యదర్శి ఏచూరి సురేష్ యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు మారం వంశీకృష్ణ, టీడీపీ నాయకులు జమలయ్య, భవాని శంకర్, చల్లా హరిబాబు, జి.దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలంతా బడిలో ఉండాలి



సత్తెనపల్లి: బడి ఈడు కలిగిన పిల్లలంతా బడిలో ఉండాలని ప్రధానోపాధ్యాయుడు ఎన్. ఏడుకొండలు అన్నారు. పట్టణంలోని శాలివాహన నగర్‌లో ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులతో కలిసి 'నేను బడికి పోతా' ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనంతో పాటు క్వాలిఫైడ్ టీచర్లతో విద్యాబోధన జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. బడి ఈడు కలిగిన పిల్లలను బడిలో చేర్చాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్లకార్డులతో నినాదాలు ఇస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు విద్యార్థులు ఉన్నారు.

రేపు అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న తారకరామ సాగర్ మెయిన్ గేట్ ఎదురుగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించనున్నట్లు స్వామి వివేకానంద చైతన్య భారతి బాధ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి 127వ జయంతి సందర్భంగా చైతన్య భారతి ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రారంభకులుగా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, విశిష్ట అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి పాల్గొంటారని పేర్కొన్నారు. విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత ద్వారానే వ్యాధుల నివారణ



డెంగీ నిరోధక మాసోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య, ఆశా కార్యకర్తలు



ర్యాలీలో సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు



తాళ్లపల్లి గ్రామంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి వెప్లి తదితరులు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో డెంగ్ నిరోధక మాసోత్సవాలు సందర్భంగా సోమవారం స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి నేతృత్వంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు గ్రామ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి మాట్లాడుతూ పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవి రత్నాకర్ ఆదేశాల మేరకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు జూలై 1 నుంచి 31వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి ఏడిస్ లార్వాలను గుర్తించి వాటిని (కీటక జనిత వ్యాధి) నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, భరించలేని తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించటం, చర్మంపై దద్దుర్లు, కనుగుడ్డు కదపలేనంతగా కళ్ల నొప్పి వంటి లక్షణాలు డెంగీ వ్యాధి లక్షణాలుగా గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. దోమలు కారణంగా వ్యాపించే డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, బోధకాలు వంటి వ్యాధుల గురించి గ్రామాలలో ప్రజలకు వివరించి ఫ్రైడేను డ్రైడేగా పాటించాల్సిందిగా సూచించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమ, మలేరియా ఆరోగ్య పర్యవేక్షకులు చెన్నంశెట్టి అంకమ్మరావు, హెల్త్ సూపర్‌వైజర్లు ఎస్.కోటేశ్వరరావు, లక్ష్మీ ప్రసన్న, హెల్త్ అసిస్టెంట్‌లు డి.సీతారామిరెడ్డి, మహేష్‌బాబు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ దూరం

మాచర్ల: డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మాచర్ల పట్టణంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్యాధికారులు పాల్గొని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తొట్లలో నీటి నిల్వలు లేకుండా వారానికి రెండు సార్లు శుభ్రపరచుకోవాలని సూచించారు. ప్రజలందరూ ఫ్రైడే డ్రైడేగా పాటించాలని పిలుపునిచ్చారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. వర్షాకాలంలో ఇంటి లోపల, బయట నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వల్ల డెంగ్ బారిన పడకుండా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నిరోధక మాసోత్సవాలు

మాచర్ల రూరల్: మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశమున్న నేపథ్యంలో గ్రామ ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించి వ్యాధుల నివారణకు సహకరించాలని పీహెచ్‌సీ వైద్యులు వెప్లి కోరారు. మంగళవారం మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో డెంగ్ వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహిస్తూ ఆయన మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత ద్వారానే అంటు వ్యాధులను నివారించవచ్చునని, వీధుల్లోని కాల్వల్లో ఎప్పటికప్పుడు పూడిక తీత పనులు చేయిస్తూ చెత్తను వీధుల్లో వేయకుండా శానిటరీ సిబ్బందికి అందించాలని సూచించారు. తీవ్ర జ్వరం, తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పి, వికారం, చర్మంపై దద్దుర్లు అలసట వంటి లక్షణాలు ఉంటే డెంగీ వ్యాధి కావచ్చునని వారు వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి ఉచితంగా చికిత్స పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ బ్రహ్మానాయుడు, తోటకూర పరమేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి అవుల వెంకట్రామయ్య తదితరులు ఉన్నారు.

సేంద్రియ ఎరువులతో భూసారాన్ని పెంచుకోవచ్చు

ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి


రెంటచింతల: సేంద్రియ ఎరువులైన పచ్చిరొట్ట పంటలు పిల్లిపెసర, జీలుగ, జనుము పంటలను వేసి భూమిలో కలియదున్ని రైతులు భూసారాన్ని పెంచుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పలు రకాల పంటలను సాగు చేసే సమయంలో జీవన ఎరువుల వాడకం వలన ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని అవగాహన కల్పించాలన్నారు. సాగు చేస్తున్న పంటలకు జీవన ఎరువుల వినియోగం వలన 20 శాతం వరకు ఖర్చు తగ్గుతుందని రైతులకు వివరించాలని సూచించారు. రసాయన ఎరువులను అధికంగా వాడకం వలన భూమిలో ఉన్న సేంద్రియ కర్బనం తగ్గుతుందని, దీంతో పంట పొలంలో భూ సాంద్రత గణనీయంగా తగ్గి పంటల దిగుబడి తగ్గిపోతుందని రైతులకు వివరించాలన్నారు. సాగు భూమిలో సూక్ష్మ పోషకాలైన మెగ్నీషియం, జింక్, ఇనుము, కాల్షియం లోపాలు ఉన్నా వాటిని పరిష్కరించుకోవడానికి మెగ్నీషియం సల్ఫేట్, జింక్ సల్ఫేట్ మూడు, నాలుగు సార్లు పిచికారీ చేసుకోవాలని తెలపాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల సూచనలతో పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించాలన్నారు. వివిధ రకాల తెగుళ్లు, పురుగుల బారి నుంచి తట్టుకునే వంగడాలు, పంట మార్పిడి, యాజమాన్య పద్ధతులను అమలు చేసినప్పుడే అధిక దిగుబడులను సాధించవచ్చని రైతులలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా కుమారస్వామి



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ బార్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం సాయంత్రం జరిగాయి. అధ్యక్షునిగా కె.కుమారస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2024-25 ఏడాదికి సంబంధించి పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించగా ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు కౌన్సిల్ సభ్యులు తెలిపారు. ఉపాధ్యక్షురాలుగా పి.భవాని, సెక్రటరీగా కె.వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీగా పి.మాణిక్యం, ట్రెజరర్‌గా ఎం.లోకేశ్వరి, లైబ్రేరియన్‌గా ఎస్‌వీ కోటేశ్వరరావు, లేడీస్ రిప్రజెంటేటివ్‌గా పి.నవ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలను ప్రముఖ క్రిమినల్ లాయర్ సీనియర్ న్యాయవాది దారా చెన్నయ్య అధ్యక్షతన నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని పిడుగురాళ్ల సీనియర్ న్యాయవాదులు రెడ్డి సాంబశివరావు, కె.కాశీ విశ్వనాథం, యు.కోటేశ్వరరావు, పి.మరియన్న, ఎం.రూత్ బనియన్, కె.జాలారావులు అభినందించారు.

యువకుడు అదృశ్యం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో యువకుడు అదృశ్యమయినట్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు అయింది. తండ్రి రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... పిడుగురాళ్ల పట్టణంలోని అక్స్‌ఫర్డ్ ఏరియాలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. కొక్కిల్ల పూర్ణ అగస్త్య ఈ మధ్య కాలంలో చదువు మానేసి ఇంటి వద్దనే ఉంటున్నట్లు తండ్రి రామాంజనేయులు పేర్కొన్నారు. అయితే సోమవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడని, బంధువులను, స్నేహితులను విచారించినా తెలియలేదని, పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పూర్ణ అగస్త్య ఇంటి నుంచి వెళ్లే సమయంలో రోజ్ కలర్ టీ షర్టు, బ్రౌన్ కలర్ నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు తెలిపారు. యువకుడు కనిపించగానే 9440796899, 8099910446 నంబర్లకు ఫోన్ చేయాలని అన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు


నరసరావుపేట ఈస్ట్: కోటప్పకొండరోడ్డు శ్రీనివాసనగర్‌లోని శ్రీగోదా పద్మావతి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉదయం స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో హోమం అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం ద్వాదశ ఆరాధన, పుష్పయాగం తర్వాత భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

వ్యాధుల సీజన్ మొదలైంది. నైరుతి రుతుపవనాల రాకతో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి. నీరు నిలిచి దోమలు వృద్ధి చెందడంతో పాటు తాగు నీరు కలుషితమవుతుంది. దీంతో సీజనల్ వ్యాధులు గ్రామాలలో నెలకొన్నాయి. ఇప్పటికే పలు పల్లెల్లో డయేరియా, మలేరియా, టైఫాయిడ్, కామెర్లు వంటి వాటితో బాధపడుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించకపోతే వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదముందని వైద్యులు, నిపుణులు హెచ్చరిస్తున్నారు.



కొత్తపల్లిలో ఆరోగ్య కేంద్రం ఎదుట నిలిచిన మురుగు నీరు



భైరవునిపాడులో చెట్లతో ప్రధాన మురుగు కాలువ



తాళ్లపల్లి గ్రామంలో పారుదల లేక నిలిచిన మురుగు నీరు

- పెరుగుతున్న వ్యాధులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

మాచర్ల రూరల్: మారిన వాతావరణ పరిస్థితులతో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. వీధులు చిత్తడిగా మారటంతో పాటు పేడ దిబ్బలు, చెత్త చెదారం పేరుకుపోవటం, కాలువల్లో పూడికతీత పనులు చేపట్టక ఏపుగా పెరిగిన చెట్లతో నీటి పారుదల లేక నిలిచిపోయిన మురుగు నీరుతో దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, డయేరియా, డెంగీ వంటి వైరస్ జ్వరాల బారిన పడుతున్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవటం ద్వారా రోగాలను నియంత్రించవచ్చునని వైద్యాధికారులు చెబుతున్నారు. మలేరియా వ్యాధి అనాఫిలిసియస్ దోమ కాటు వలన వస్తుంది. ఈ దోమలు మురుగు నీటి గుంతల్లో వృద్ధి చెందుతాయి. మలేరియా సోకిన వారికి చలి, వణుకు, ఒళ్లు నొప్పులు విడతల వారీగా జ్వరం రావటం జరుగుతుంది. కలుషితమైన ఆహారం, నీటి వలన డయేరియా సంభవిస్తుంది. ఈ వ్యాధి వలన విరేచనాలు, వాంతులు, కడుపులో నొప్పి వంటి లక్షణాలు సంభవిస్తాయి.

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

పల్లెల్లో పలువురు సీజనల్ వ్యాధులతో మంచాన పడుతున్నారు. వీటి నివారణకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. క్షేత్ర స్థాయిలో పర్యటించి వ్యాధులకు అడ్డుకట్ట వేయాలి. గ్రామాల్లో కాలువల్లో పూడికతీత, పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని, అధికారులు పారిశుద్ధ్య పనులను మెరుగుపరచి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనుల మెరుగుకు కృషి చేస్తాం



సీజనల్ వ్యాధుల నివారణ కోసం చర్యలు చేపట్టాం. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగుపర్చేందుకు సిబ్బందిని ఆదేశించాం. ప్రతి గ్రామంలో ప్రత్యేకంగా తనిఖీలు చేసి సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. కింది స్థాయి సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి వారి పరిసర ప్రాంతాలలో మురుగు నీరు నిల్వ లేకుండా చూస్తాం.

-ఎంపీడీవో సరోజినీ దేవి

6 నుంచి వారాహీదేవి నవరాత్రులు

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ త్రిశక్తి దుర్గా పీఠంలో వేంచేసిన దుర్గా మాతని వారాహీదేవిగా అలంకరించి ఈ నెల 6 నుంచి 15 వరకు నవరాత్రులు జరుపుతున్నామని పీఠాధిపతి వెలిదండ్ల హనుమత్ స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ వారాహీమాతకి లలితా సహస్ర నామ స్తోత్రం, వారాహీ అష్టోత్తర శతనామాలు, అమ్మవారి ద్వాదశ నామాలు, మూల మంత్రం, గాయత్రి మంత్రంతో కుంకుమార్చన ఉంటాయని తెలిపారు. ప్రత్యేక నైవేద్యాలు, మంత్ర పుష్పం, హారతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిది రోజులు పాల్గొనే భక్తులకు శ్రీచక్ర మేరువ (ఒక్కొక్కరికి ఒక్కోటి)ఇచ్చి కుంకుమ పూజలు జరిపిస్తామని, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత నాది

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, మాజీ ఎమ్మెల్సీ జంగా

గురజాల: ఎన్డీయే కూటమిలోని తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత నాది అని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు భరోసా నిచ్చారు. స్థానిక చల్లగుండ్ల గార్డెన్స్‌లో మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది చరిత్రాత్మక విజయమని, నిశ్శబ్ద విప్లవంగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. మనకు వచ్చిన అధికారాన్ని ఒక బాధ్యతగా స్వీకరించాలన్నారు. అప్పుడే ప్రజలు మనల్ని ఆదరిస్తారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌లను అవమానించడంతో ప్రతి కార్యకర్త ఒక కసిగా పనిచేశారన్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడిన కార్యకర్తలను మరచిపోనని వారికి ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఐదేళ్లలో చేయాల్సిన అభివృద్ధికి ఒక ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. త్వరలో గురజాలలో మెగా జాబ్ మేళా నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. ఒకరికి ఒకరు గౌరవంగా పలకరించుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు సీసీఆర్‌సీ కార్డులు , కంది విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ ఆడపా శ్రీనివాసరావు, కటికం అంకారావు, గనిపల్లి శ్యాం, పులుకూరి కాంతరావు, శరమాళ్ల హనుమంతరావు, చింతకాయల దానయ్య, పల్నాటి నాగేశ్వరరావు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలపై దృష్టి పెట్టాలి

ఎంపీపీ సంపూర్ణమ్మ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంపూర్ణమ్మ

రెంటచింతల: గ్రామాలలో ప్రజల అవసరాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ పి.సంపూర్ణమ్మ అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కలిసి సమష్టిగా కృషి చేసినప్పుడే గ్రామాలలో సమస్యలు పరిష్కరించడంతో పాటు ఆయా గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే అధికారులు గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఎంపీడీవో శంకర్‌రావు మాట్లాడుతూ రెంటచింతల గ్రామంలో సైడ్ కాల్వల్లో నున్న మంచి నీటి పైపులైన్లు వెంటనే కాల్వ పైభాగంలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం కలుషిత నీరు తాగడం వలన వివిధ ప్రాంతాలలో డయేరియా కేసులు అధికంగా వస్తున్నాయన్నారు. గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని.. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఏవో బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా ఇప్పటి వరకు 190 క్వింటాళ్ల జీలుగలను రైతులకు పంపిణీ చేశామన్నారు. కొద్ది రోజులలో 25 క్వింటాళ్ల కందులు కూడా వస్తున్నట్లు రాయితీపై 1 కేజీ రూ.98కే రైతులకు అందజేయనున్నట్లు కావాల్సిన రైతులు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ఏరువ గౌర్రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఎంపీటీసీలు, ఏపీవో జయచంద్ర, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న జాజి విత్తన యజ్ఞం



నల్లమలలో విత్తన బంతులు చల్లుతున్న జాజి

కారెంపూడి: నల్లమల అటవీ ప్రాంతంలో విత్తన బంతులు చల్లే సేవా కార్యక్రమాన్ని కారెంపూడికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి) కొనసాగిస్తున్నారు. కారెంపూడి సమీపంలోని కాకిరాల రిజర్వ్ ఫారెస్టుకు చెందిన మైదాన ప్రాంతాలలో విత్తన బంతులను కొందరు సహచరులతో కలసి వెళ్లి చల్లారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భూమి బాగా పదును కావడంతో పాటు తర్వాత కురిసే వర్షాలకు మొలుస్తాయనే సంకల్పంతో విత్తన బంతులను విరివిగా చల్లారు. విత్తనాలు మధ్యలో ఉంచి పాటి ఎరువుతో కలిపిన పాటి మట్టిని చుట్టూ ఉండలా చుట్టి వాటిని ఎండ బెట్టి తర్వాత వాటిని విత్తన బంతులుగా చల్లుతామని జాజి తెలిపారు. విత్తన బంతి భూమిపై పడిన తర్వాత దానికున్న మట్టి భూమిని తాకి.. వర్షం పడిన తర్వాత విత్తన బంతి నుంచి మొలక బయటకు వచ్చి మొక్కగా ఎదుగుతుందన్నారు. తన సంకల్పానికి మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు విత్తన బంతులు తయారు చేసి అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలు పంచుకుంటున్న అందరికి జాజి అభినందనలు తెలిపారు. అయితే ఇది ఒక ఉద్యమంగా కొనసాగాలని ఎక్కడికక్కడ ఎవరికి వారు విత్తన బంతులు సమీపంలోని అటవీ మైదాన ప్రాంతాలలో చల్లడంతో పాటు మొక్కలు విరివిగా నాటి వాటిని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణకు, వర్షాలు సమృద్ధిగా పడడం కోసం, సస్యశ్యామలైన పంటలు పండడం కోసం మన సమయాన్ని కొద్దిగా పర్యావరణ పరిరక్షణకు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందని.. అది మన ప్రాథమిక విధి అని మరచిపోకూడదన్నారు.

క్రీడా రంగానికి శంకరనాగిరెడ్డి విశేష సేవలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలత



పీడీ శంకరనాగిరెడ్డి, భవానీ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ, ఉపాధ్యాయులు

సత్తెనపల్లి: క్రీడా రంగానికి పీడీ ఇనగంటి శంకరనాగిరెడ్డి విశేష సేవలు అందించారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలత అన్నారు. పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా సేవలందించిన ఇనగంటి శంకరనాగిరెడ్డి గత నెల 30న ఉద్యోగ విరమణ చేయగా మంగళవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థులను జాతీయ స్థాయి క్రీడాకారులుగా శంకరనాగిరెడ్డి తీర్చిదిద్దారని అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయని కె.లతా ప్రియదర్శిని మాట్లాడుతూ క్రీడాకారులగానే కాకుండా.. క్రమ శిక్షణతో మెలిగేలా విద్యార్థులకు శిక్షణనిచ్చారన్నారు. శంకరనాగిరెడ్డి నాలుగు దశాబ్దాలుగా అందించిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. శంకరనాగిరెడ్డి, భవాని దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘం మాజీ ఉపాధ్యక్షుడు కరీముల్లా రావు, ఉపాధ్యాయులు వీవీ హరనాథ్, లక్ష్మీ పతి, శ్రీనివాసరెడ్డి, చిన్నిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీలో ప్రజా ప్రతినిధులను విస్మరించారు

అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీలో భాగంగా స్థానిక ప్రజా ప్రతినిధులను విస్మరించటం దారుణమని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఆహ్వానం లేకుండా పింఛను పంపిణీ చేయడం వారిని అవమాన పరచడమేనని పేర్కొన్నారు. అధికారులు కూడా ఏకపక్షంగా వ్యవహరించి, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించకపోవడంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత



రెంటచింతల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతను ఇస్తుందని మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక రేగులమాన్యం కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల(గిరిజన సంక్షేమ శాఖ)లో చదువుకుంటున్న 34 మంది విద్యార్థులకు ఆయన హెచ్‌ఎం కె.రమేష్, టీడీపీ నాయకులతో కలిసి స్టూడెంట్ కిట్స్‌ను పంపిణీ చేసి మాట్లాడారు. విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వం అన్ని వసతులతో పాఠశాలలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సీహెచ్ అబ్బిరెడ్డి, టీడీపీ నాయకులు బొడపాటి రామకృష్ణ, మూలి రాజారెడ్డి, మద్ది రాజేకుమార్, మున్నా ప్రభురాజు, పాశం గోపయ్య, షేక్ బుజ్జి, హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.